క్లుప్తంగా

చురుగ్గా పారిశుధ్య పనులు



సాయికృష్ణానగర్‌లో బ్లీచింగ్ చల్లిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఆదివారం పలు వార్డుల్లో వీధులు, రోడ్లు శుభ్రం చేయించడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు. అలాగే రోడ్ల పక్కన, మంచినీటి ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లారు. ప్రజలు సీజనల్ వ్యాధులు బారినపడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

సన్మానం



డీఎస్పీని సత్కరిస్తున్న లక్షుంనాయుడు తదితరులు

బొబ్బిలి: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావును ఆదివారం సన్మానించారు. నర్సీపట్నానికి ఆయన బదిలీ కావడంతో ఆయన సేవలను ప్రశంసిస్తూ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు, మదర్ థెరీసా సేవా సంస్థ అధ్యక్షుడు కైవేలు దుశ్శాలువాతో సన్మానించారు.

దుస్తుల పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న దాత

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో 20 మంది నిరుపేదలకు సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. తనకు తోచిన దానిలో కొంత డబ్బులను ఇలా సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుండడం చాలా సంతృప్తినిస్తోందని దాత తెలిపారు.

ఘనంగా బాలఅన్నమ్మ యాత్రా మహోత్సవం



సంతకవిటి: ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో బాలఅన్నమ్మ యాత్రా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో రెండో రోజు అయిన ఆదివారం ఉదయం భగవద్గీత పారాయణం, అఘోరాల డ్యాన్స్, సంగిడీల పోటీలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చారు. రాత్రి బాలు రైడర్స్ క్లాసికల్ డ్యాన్స్ షో, జబర్దస్త్ షో కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ గంటా షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.


'మత్తు'తో జీవితం నాశనం



లక్ష్మణవలసలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్ర

రేగిడి: గంజాయి, ఖైనీ, గుట్కా, సారా, మద్యం వంటి మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర అన్నారు. మండలంలోని లక్ష్మణవలస, తోకలవలస గ్రామాల్లో మత్తు పదార్థాలు-వాటి దుష్ప్రభావాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులంతా ఫ్యాషన్ మోజులో పడి తమ జీవితాలు పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, సన్మార్గంలో నడిచి ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నీలావతి తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షలతో అభివృద్ధి పనులు



కాలువల నిర్మాణం పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో రూ.4 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రతీ పంచాయతీకి రూ.4 లక్షల చొప్పున నిధులు కేటాయించారని, వాటితో గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టామని సర్పంచ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డెక్కే ముందు ఆలోచించాల్సిందే..

- అమలులోకి కొత్త వాహన చట్టం
- లైసెన్స్ లేకుంటే రూ.5 వేలు
- మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు
- హెల్మెట్ ధరించకుంటే రూ.వెయ్యి జరిమానా
- నిబంధనల అమలుపై పోలీసుల ప్రత్యేక దృష్టి



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు(ఫైల్)

రామభద్రపురం:

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన రోజులకు కాలం చెల్లింది. ఇక నుంచి హెల్మెట్ లేకపోయినా, వాహన ధ్రువపత్రాలు చూపించకపోయినా రూ.వేలల్లో జరిమానా కట్టాల్సిందే. ఇదంతా కొత్త వాహన చట్టం చెబుతోంది. గతేడాది జూన్ నుంచే చట్టం అమలులోకి వచ్చినా అది క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలుకావడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసులు చర్యలు షురూ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చేపడుతున్న ఈ చర్యలకు అంతా సహకరించాలని కోరుతున్నారు. రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

మూడేళ్ల జైలు.. రూ.25 వేలు ఫైన్...



గతంలో మైనర్లు వాహనాలు నడిపితే పెద్దగా శిక్షలేమీ ఉండేవి కావు. అయితే రోడ్డు ప్రమాదాలకు మైనర్లు వాహనం నడపడం కూడా ఒక కారణం కావడంతో అధికారులు నిబంధనలు కఠినతరం చేసి, శిక్షలు అమలు చేస్తున్నారు. కొత్త వాహన చట్టంలోని రూల్స్ ప్రకారం మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారికి రూ.25 వేలు జరిమానా విధించడంతో పాటు మూడేళ్ల జైలు శిక్ష కూడా వేసే అవకాశం ఉంది.

ఇతరులకు బండిస్తే అంతే సంగతులు..

చాలామంది తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలకు బైక్ ఇవ్వడాన్ని చాలా గొప్పగా భావిస్తారు. అయితే ఇకపై అది కుదరదు. సదరు మైనర్ బాలుడు లేదా బాలిక బైక్ నడిపి ప్రమాదానికి గురైతే వాహనం ఎవరి పేరు మీద రిజిస్టర్ అయి ఉందో వారిపైన కేసు నమోదు చేస్తారు. యాక్సిడెంట్ చేసిన వారితో పాటు వాహనం ఇచ్చిన వారిపైనా, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అమ్మిన వ్యక్తిపైనా కేసు నమోదు చేస్తారు. అప్పట్లో అయితే వెంటనే స్టేషన్ బెయిల్ మంజూరయ్యేది. నేరం రుజువైతే.. రెండేళ్ల వరకు జైలు శిక్ష ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. యాక్సిడెంట్‌కు కారణమైన వ్యక్తితో పాటు సంబంధిత వాహన యాజమానికి వెంటనే బెయిల్ వచ్చే అవకాశం లేదు. పదేళ్ల పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశాలు ఉన్నాయని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

జరిమానా వివరాలు ఇలా..



హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనదారుల ప్రయాణం(ఫైల్)

- లైసెన్సు లేకుండా వాహనం నడిపితే రూ.5 వేలు(గతంలో ఇది రూ.500గా ఉండేది.)
- రెడ్‌లైట్‌ను ఉల్లంఘించి వాహనం నడిపితే రూ.500
- రాంగ్‌రూట్‌లో వాహనం నడిపితే రూ.5 వేలు
- అతివేగంగా వాహనం నడిపితే రూ.వెయ్యి
- మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు(గతంలో ఇది రూ.2వేలుగా ఉండేది.)
- ర్యాష్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కారు నడిపితే రూ.వెయ్యి జరిమానా అలాగే 3 నెలల పాటు లైసెన్స్ రద్దు
- అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళితే రూ.10 వేలు
- ద్విచక్ర వాహనాల్లో ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడితే రూ.2 వేలు
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.2 వేలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..



ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలి. వచ్చీరాని డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని, వాహనాలను జాగ్రత్తగా నడపాలి.

-కె.నారాయణరావు, డీఎస్పీ, బొబ్బిలి

ఆ గ్రామంలో పగలే వెన్నెల



రామభద్రపురం మండలం, తారాపురం గ్రామంలోని వీధి లైట్లు పగలూ రాత్రి అనే తేడా లేకుండా నిత్యం వెలుగుతూనే ఉంటాయి. పట్టపగలే విద్యుత్ బల్బులు వెలిగి ఉండడాన్ని చూసిన వారంతా ఆ గ్రామంలో పగలే వెన్నెల కాస్తుందని పరోక్షంగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నారు. ఇంధన పొదుపు.. భవిష్యత్‌కు మదుపు.. విద్యుత్ ఆదా.. భవిష్యత్‌కు భరోసా.. అని పిలుపునిస్తూ సంబంధిత అధికారులు చేసే నినాదాలు ప్రచార ఆర్భాటానికే తప్ప నిర్వహణలో చిత్తశుద్ధి లేదని విమర్శిస్తున్నారు.

-రామభద్రపురం

భౌబోయ్ కుక్కలు



రామభద్రపురం మండల కేంద్రంలో కుక్కలు బెడద ఎక్కువైంది. రోడ్లు, వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ దారిన పోయే వారిపై దాడికి ఎగబడుతున్నాయి. పరిగెత్తలేక వృద్ధులు, చిన్నారులు, మహిళలు కుక్కకాటుకు గురై, ఆస్పత్రి పాలవుతున్నారు. ఇటీవల ఆవుదూడలను కూడా శునకాలు కరిచి చంపేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, కుక్కల భయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-రామభద్రపురం

కమ్మేసిన పొగమంచు..



రేగిడి మండలాన్ని పొగమంచు కమ్మేస్తోంది. రాత్రి 8 గంటల నుంచే మంచు కురవడం ప్రారంభమై, ఉదయం 9 గంటల వరకు ఉంటోంది. దట్టమైన పొగమంచు కారణంగా ఎక్కడ ఏం ఉందో కానరావడం లేదు. కనీసం ఎదురుగా వస్తున్న మనిషి కూడా దగ్గరకు వెళ్తే తప్ప కనిపించని పరిస్థితి. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లడం లేదు. అత్యవసరమైతే టార్చిలైట్లు, సెల్‌ఫోన్ల లైట్లు వేసుకుని మరీ వెళ్తున్నారు. చిత్రంలో కనిపిస్తోన్న దృశ్యం వన్నలి గ్రామంలో బుధవారం కురిసిన మంచు దృశ్యం.

-రేగిడి

అమిత్ షా.. గో బ్యాక్..



ఏపీ పర్యటనలో కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా..కు నిరసన సెగ తగిలింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై ఆయన చేసిన అవమానకర వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ అమిత్ షా.. గో బ్యాక్.. అని వామపక్షాల నేతలు నినదిస్తూ బొబ్బిలిలోని జెండామహల్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాతను అవమానించేలా మాట్లాడినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని, అలాగే మంత్రివర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.శంకరరావు, కె.అప్పన్న, బి.శ్రీనివాసరావు, ఎస్.గోపాలం, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

-బొబ్బిలి

మధుర కావ్యం శశాంక విజయం



మాట్లాడుతున్న సాహితీవేత్త రమణమూర్తి

రాజాం సిటీ: కొన్ని వందల ఏళ్ల క్రితం దక్షిణాదికి చెందిన మధుర అనే రాజధానిలో నివశించిన శేషం వెంకటపతి రచించిన 'శశాంక విజయం' అనే ప్రబంధం.. శృంగార, వీర రసాలతో కూడిన ఓ మధుర కావ్యమని సాహితీవేత్త ఒమ్మి రమణమూర్తి ప్రశంసించారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక(రారవే) పదో వార్షికోత్స వ సమావేశంలో 'శశాంక విజయం కావ్య సౌరభం' అనే అంశంపై ప్రసంగించారు. తారా చంద్రుల కథ ఆధారంగా దంపతుల మధ్య వయో భేదం హెచ్చుగా ఉన్నప్పుడు జరగబోయే ప్రమాదాలను శృంగార రస ప్రధానంగా రచయిత ఆ రచన చేశారన్నారు. సాదా గ్రాంథిక భాషలోనే రచించడం వల్ల ఆ ప్రబంధం చదివి ఆనందించదగ్గ గ్రంథమన్నా రు. ప్రజల్లో శశాంక విజయం పచ్చి శృంగార ప్రబంధమనే ఒక రకమైన ముద్ర ఉన్నా, ఆనాటి సామాజి క పరిస్థితులు, సమాజంలో విచ్చలవిడి శృంగారం వల్ల వచ్చే ఇబ్బందులు, పెద్ద మనుషులు తగాదా లు తీర్చడాలు, యుద్ధాలు ఇలా ఎన్నో విషయాల ను ఆ కావ్యంలో చదవవచ్చన్నారు. అనంతరం వేదిక సభ్యులు రమణమూర్తిని ఘనంగా సత్కరించారు. సమావేశంలో గార రంగనాథం, నేతేటి గణేశ్వరరావు, రౌతు గణపతిరావునాయుడు, పిల్లా తిరుపతిరావు, పెంకి దయానిధినాయుడు, ఆల్తి మోహనరావు, సమతం మహేశ్వరరావు తదితరు లు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

రామభద్రపురం/తెర్లాం/బాడంగి/బొబ్బిలిరూరల్: అన్ని మండలాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామగ్రామాన చేపడుతున్న ఈ శిబిరాల్లో పశువులు, కోళ్లు, ఇతర మూగజీవాలకు వ్యాధులు రాకుండా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. రోజుకు రెండు గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

నేడు పినపెంకిలో భూ సర్వే

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో భూముల రీసర్వే సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తహసీల్దారు సుధాకర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. సర్వేయర్లంతా 5 బృందాలుగా ఏర్పడి తొలుత గ్రౌండ్ ట్రూతింగ్ చేపడతారన్నారు. గ్రామంలో 1220 ఎకరాల భూమి ఉందని, ఇప్పటికే సర్వేపై ప్రజలకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



ఎంజేవలసలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రాజాం: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర, సిద్ధేశ్వరిలు కోరారు. వంద రోజుల క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొమ్మినాయుడువలస, ఎంజేవలస, విజయరాంపురం గ్రామాల్లో అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కోరింత దగ్గు, కెల్ల పడడం, ఎక్కువగా కఫంతో బాధపడడం వంటివి క్షయవ్యాధి లక్షణాలు కావచ్చని, దగ్గరలోని ప్రభుత్వాస్పత్రిలో కెల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆరంభంలో వ్యాధిని గుర్తిస్తే సులభంగా తగ్గుతుందని, లేదంటే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందన్నారు. అనంతరం వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని గ్రామంలోని యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్షయవ్యాధి నిర్మూలన విభాగం డివిజనల్ సూపర్‌వైజర్ లలిత, హెచ్‌వీ శశి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

రామభద్రపురం: స్థానిక బొక్కాపు వారి చెరువు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ దుర్ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విశాఖపట్టణంలోని షీలానగర్‌కు చెందిన బంకురు బాబ్జీ సంక్రాంతి పండగ నిమిత్తం తన బంధువైన పూడికి వీధికి చెందిన కునుకు గౌరీశంకర్ ఇంటికి వచ్చాడు. బొబ్బిలిలోని తన మేనకోడలు ఇంటికి వెళదామని బైక్‌పై బయలుదేరాడు. సరిగ్గా బొక్కాపు వాని చెరువు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఈయన బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రథమ చికిత్స నిమిత్త 108 అంబులెన్స్‌లో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఆర్.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిఅస్త్రంతో కత్తెరపురుగు నివారణ



అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ఐసీఆర్‌పీ తవిటినాయుడు

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.గౌరీశ్వరరావు, పి.తవినాయుడులు తొలుత ప్రయోగాత్మకంగా అగ్నిఅస్త్రం తయారు చేసి, రైతులకు చూపించారు. అనంతరం దాని ప్రయోజనాలు వివరించారు. మనం తయారు చేసుకున్న అగ్నిఅస్త్రం పిచికారీ చేయడం ద్వారా మొక్కజొన్న పంటను ఆశించే కత్తెరపురుగును నివారించవచ్చన్నారు. అగ్నిఅస్త్రం తయారీకి ఆవుమూత్రం 15 లీటర్లు, పొగాకు కాడలు 2 కిలోలు, వేపాకు 4 కిలోలు, పచ్చిమిర్చి అరకిలో, తెల్ల ఉల్లి అరకిలో చొప్పున ఓ టబ్బులోకి తీసుకుని, మూడు సార్లు పొంగు వచ్చేలా దానిని బాగా మరగబెట్టాలి. ఆ తర్వాత ఓ ట్యాంకు(టబ్బు) నీటిలో లీటరు ద్రావణం వేసి పంటపై పిచికారీ చేయాలి. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని వారు తెలిపారు. ప్రతీ రైతు ప్రకృతి సేద్యం పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, వన్నలి సర్పంచ్ గార రమణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో లైబ్రేరియన్ పుస్తకాలు చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు తప్పనిసరిగా పుస్తక పఠనం చేయాలన్నారు. అలాగే గ్రంథాలయానికి ప్రతిరోజూ వచ్చి, పుస్తకాలు, వార్తాపత్రికలు చదవాలన్నారు. పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ తదితర క్రీడాంశాల్లో కూడా తర్ఫీదు పొందాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో ప్రతీ విద్యార్థి చేరాలని కోరారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రభలు,మేళతాళాలతో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆధార్ నమోదు చేయించుకోవాలి

బాడంగి: ఆరేళ్ల వయసులోపు చిన్నారులకు ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. ఇదే విషయమై ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. గజరాయునివలస గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామని, ప్రతీ చిన్నారి కి ఆధార్ చేయించాలని, అలా అయితే ప్రభుత్వ పథకాలు, జనాభా లెక్కలకు సులభతరమవుతుందన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ కె.సతీష్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని పాతబొబ్బిలి హనుమాన్ జంక్షన్‌లో రోడ్డు భద్రతా నియమాలపై ఆదివారం అవగాహన కల్పించారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని తెలిపారు. కార్యక్రమంలో యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మిందివిజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



శ్రీరామ్మూర్తిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి తదితరులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పక్కి గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గొట్టాపు శ్రీరామ్మూర్తిని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహనరావులు ఆదివారం సన్మానించారు. అనంతరం శ్రీరామ్మూర్తి సేవలను ప్రశంసించారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో వారు చేసిన మంచి సేవలే వారికి తగిన గుర్తింపునిస్తాయని, ప్రతీ ఉద్యోగి చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, మంచి ఉద్యోగులుగా గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో వంగపండు శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.